అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్‌లో సీసీరోడ్లు, భూగర్భ డ్రైనేజీ ఏర్పాటు చేయాలని, వల్లభ్‌నగర్‌లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని అల్వాల్‌కు తీసుకురావాలని మచ్చబొల్లారం బీజేపీ నేతలు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. బొల్లారం రైల్వే ఆర్‌యూబీ పనులను ప్రారంభించేందుకు ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి చేస్తున్న కృషిని వారు ఈ సందర్భంగా అభినందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మల్కాజిగిరి నియోజకవర్గం అభివృద్ధికి పార్టీలకు అతీతంగా సహకరించాలని, ఆర్‌యూబీ పనులకు రైల్వే అధికారులు సహకరిస్తున్నారన్నారు. త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయని వివరించారు. బీజేపీ నేతలు వెంకటేష్, మల్లిఖార్జున్‌యాదవ్, పద్మిని, సుజాత, అజిత్, సాయి, రమేష్, ఆనంద్, నవీన్ తదితరులున్నారు.

ఆదర్శనగర్ కాలనీలో మొక్కల పంపిణీ



మొక్కలు పంపిణీ చేస్తున్న డిప్యూటీ మేయర్ శివకుమార్‌గౌడ్

మేడిపల్లి: మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండలం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వనమహోత్సవంలో భాగంగా ఆదివారం పీర్జాదిగూడ నగరపాలక పరిధిలో 17వ డివిజన్ ఆదర్శనగర్ కాలనీలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్ మొక్కలు పంపిణీ చేశారు. ఈనెల 22 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని, ప్రతి ఇంటికి మున్సిపల్ సిబ్బంది వచ్చి తమ ఇళ్లల్లో పూలమొక్కలు, పండ్ల మొక్కలను పెంచుకునేందుకు ఆసక్తి కలిగిన వారు సంబంధిత వార్డు ఆఫీసర్లను సంప్రదించి తమకు అవసరమైన మొక్కలను తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ సిబ్బంది, నగర ప్రజలు పాల్గొన్నారు.

బీజేపీ నేతల ముందస్తు అరెస్టులు సరికాదు

మల్కాజిగిరి: సీఎం అబ్దుల్లాపూర్‌మెట్‌లో జరిగిన పర్యటన సందర్భంగా బీజేపీ నేతలు, కార్యకర్తలను ముందస్తుగా అరెస్ట్ చేయడం గర్హనీయమని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. ముఖ్యమంత్రి ఎక్కడో పర్యటిస్తే ఇక్కడి వారిని అరెస్ట్ చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. సీఎం రోడ్డు మీద ఉంటే బీజేపీ వాళ్లు పోలీస్‌స్టేషన్‌లో ఉండాలా.. అని ఆయన ప్రశ్నించారు. హామీలను నెరవేర్చడంలో విఫలమైన ముఖ్యమంత్రికి బీజేపీ అంటే భయం పట్టుకుందని, ఇలాంటి చర్యలు సరికాదన్నారు.



మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రవణ్

ఘనంగా శ్రీవారి కల్యాణోత్సవం



కల్యాణశోభలో ఉత్సవమూర్తులు

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్‌లోని లక్ష్మీవేంకటేశ్వర దేవాలయంలో శ్రీవారి కల్యాణోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ప్రధాన అర్చకులు వెంకటరమణాచార్యులు, అర్చకులు తులసీరమణాచార్యులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతినెలా రెండో ఆదివారం లోక కళ్యాణార్థం శ్రీవారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నామని ఆలయ ఈఓ రవీందర్‌రెడ్డి తెలిపారు. కల్యాణోత్సవంలో క్లర్క్ సుధాకర్, భక్తులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న మున్సిపల్ సిబ్బంది

బోడుప్పల్ : ఆరోగ్యవంతమైన జీవితం కోసం ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలని బోడుప్పల్ కమిషనర్ రామలింగం అన్నారు. బోడుప్పల్‌లో స్వచ్ఛ భారత మిషన్‌లో భాగంగా 'పరిశుభ్రతను పాటించండి- రోగాలను తరిమికొట్టండి' అనే నినాదంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వర్షాకాలంలో వచ్చే వ్యాధుల గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరపత్రాల ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. ఇళ్లు, పెరట్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, చెత్త చెదారాన్ని తొలగించి పరిశుభ్రంగా ఉండేలా పరిసరాలను చూసుకోవాలన్నారు. కాలనీల్లో వ్యర్థాలను రోడ్లు, ఖాళీ ప్రదేశాల్లో పారవేయకుండా స్వచ్ఛ ఆటోలకు సహకరించాలని కోరారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి



సమావేశంలో దళిత జన స్టూడెంట్ ఫెడరేషన్ నాయకులు

మల్లాపూర్: నాచారం డివిజన్ దళిత జన స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ముఖ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దళిత జన స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ బొజ్జ రాకేష్ హాజరై మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.6000 కోట్లు, స్కాలర్‌షిప్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్యార్థులు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం దరఖాస్తులు చేసుకునేందుకు, వాటిని విడుదల చేసేందుకు ప్రభుత్వం జారీ చేసి మార్గదర్శకాలు ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడంలేదన్నారు. విద్యార్థుల కోర్సు ముగిసే వరకు ఫీజులు విడుదల చేయకపోవడంతో వారు ఉన్నత చదువులు చదవలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల పట్ల న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఫెడరేషన్ ఉప్పల్ ఇన్‌చార్జి మాజీత్, ఈసీఐఎల్ ఇన్‌చార్జి నాగరాజు, అశోక్‌నాయక్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఉద్యమకారుల హామీలను నెరవేర్చాలి



అల్వాల్ ప్రెస్‌క్లబ్ సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నేతలు

అల్వాల్ : తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నేతల సమావేశం ఆదివారం అల్వాల్‌లోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించి పలు తీర్మానాలను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఫోరం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ చీమ శ్రీనివాస్, పట్లోళ్ల సురేందర్‌రెడ్డిలు మాట్లాడుతూ.. ఈనెల 24వ తేదీ నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి బిల్లు ప్రవేశపెట్టాలన్నారు. రవీంద్రభారతిలో సెప్టెంబర్ 1న తెలంగాణ ఉద్యమకారులకు ఘన సత్కారం చేయాలని, తెలంగాణ ఉద్యమకారుల చరిత్రను తెలుసుకునేందుకు డాక్యుమెంటరీ ద్వారా ప్రతి ఉద్యమకారుడి చరిత్రను రికార్డు చేయడం, ఆర్‌ఎంపీ, పీఎంపీ సమస్యలపై వెంటనే ఓ కమిటీని వేయాలని కోరారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లో ఉద్యమకారులను గుర్తించేందుకు కమిటీని ప్రకటించాలన్నారు. ఫోరం కన్వీనర్ జ్యోతిరెడ్డి, ఉపాధ్యక్షులు వీరస్వామి, కో–ఆర్డినేటర్ రాంబాబు, దయానంద్, కొండస్వామి, సందీప్, కిరణ్, శ్రీనివాస్, భాస్కర్ తదితరులున్నారు.

రూ. 35 లక్షలతో అభివృద్ధి పనులు

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్ పరిధిలోని నార్త్ కళ్యాణ్‌పురి కాలనీలో రూ.35 లక్షలతో చేపట్టబోయే సీసీ రోడ్డు పనులకు ఆదివారం జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీసభ్యులు, చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్‌తో కలిసి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. ఆయన మట్లాడుతూ.. చిలుకానగర్‌లో దశలవారీగా అభివృద్ధి పనులను చేపడుతామన్నారు. నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌లను అభివృద్ధి చేసి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామన్నారు. నార్త్ కళ్యాణ్‌పురి కాలనీవాసులు పాల్గొన్నారు.

భారీ వర్షం.. జన జీవనం అస్తవ్యస్తం



ఆనంద్‌బాగ్ ప్రధాన రోడ్డు మార్గంలో ఇలా..

మల్కాజిగిరి/గౌతంనగర్/మౌలాలి: నగరంలో కురిసిన భారీ వర్షం కారణంగా మల్కాజిగిరి, ఆనంద్‌బాగ్, ఆర్కేనగర్, వాణీనగర్, గౌతంనగర్, మిర్జాల్‌గూడ చిన్మయ్‌మార్గ్, జ్యోతినగర్, వినాయక్‌నగర్, నేరేడ్‌మెట్, మౌలాలి, దీన్‌దయాళ్‌నగర్ తదితర ప్రాంతాల్లో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఓపెన్ నాలాలు పొంగి పొర్లాయి. ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ పరిధిలోని షిరిడీనగర్, ఎన్ఎండీసీ కాలనీ, సత్తిరెడ్డినగర్ తదితర ప్రాంతాల్లో వర్షంనీరు ఇళ్ల ముందు మోకాళ్లలోతు ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అప్రమత్తమైన జీహెచ్ఎంసీ ఎమర్జెన్సీ మాన్సూన్ టీమ్ వరద నీటిని తొలగించారు.



సత్తిరెడ్డినగర్‌లో..



దీన్‌దయాళ్‌నగర్ రోడ్ నెంబర్ 4లో..



మిర్జాల్‌గూడ చిన్మయ్‌మార్గ్‌లో...



ఆర్కేనగర్ బిడ్జి వద్ద సహాయక చర్యల్లో..



మిర్జాల్‌గూడలో..

నకిలీ డాక్యుమెంట్ సృష్టించిన ముగ్గురి రిమాండ్

మేడిపల్లి: ఇతరుల స్థలంపై నకిలీ డాక్యుమెంట్ సృష్టించి విక్రయించిన పలువురిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించిన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని ఓల్డ్ బోయినపల్లికి చెందిన కట్టికమాల, ఘాస్ మండీకి చెందిన సంఘం జోష్న్యు,రాజులు కలిసి చెంగిచెర్లలోని రామకృష్ణ లేవుట్‌కు చెందిన వేయి చదరపు గజాల స్థలంపై కన్నేసి యజమాని అందుబాటులో లేకపోవడంతో సదరు స్థలాన్ని కాజేయాలని స్థల యజమాని చనిపోయినట్లు నకిలీ మరణ ధ్రువీకరణపత్రాన్ని గుర్తుతెలియని వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేసి అదే స్థలాన్ని తమ పేర్లపై రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అనంతరం తక్కువ రేటుకు అమ్ముకుని వచ్చిన సొమ్మును సమానంగా పంచుకున్నారు. సదరు స్థలం జీపీఏ హోల్డర్ ముళ్ళపుడి వెంకట సుబ్బారావుకు విషయం తెలియడంతో నిందితులపై మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు.

ఘనంగా అరోరా కళాశాల వార్షికోత్సవం



మేడిపల్లి: అరోరా కళాశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించగా.. కళాశాల డైరెక్టర్ ముఖ్య అతిథులుగా భారత భారతి అధ్యక్షుడు హనుమంత్‌రెడ్డి, లీడ్‌సొల్యూషన్ ఆర్కెటెక్ విజయభాస్కర్ హాజరయ్యారు. అనంతరం వార్షికోత్సవ కార్యక్రమంలో భాగంగా జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంతో ప్రారంభించారు. సాంప్రదాయ నృత్యగీతాలతో విద్యార్థులు అలరించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరంలో డిప్యూటీ మేయర్ కర్ర శివకుమార్ గౌడ్

గౌతంనగర్ : గౌతంనగర్ డివిజన్ మల్లిఖార్జుననగర్ అసోసియేషన్ గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా వైద్యులు పలు పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. అర్జున్, అంకిత, మచ్చేందర్‌యాదవ్, సాగర్, ప్రవీణ్, వెంకటయ్య, కన్నా తదితరులు పాల్గొన్నారు.

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 17వ డివిజన్ మారుతీనగర్ హనుమాన్ గుడి వద్ద ఆదివారం కమల జనరల్ ఆసుపత్రి, ఆర్వీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్ హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కాలనీవాసులు తదితరులున్నారు.

మురుగు సమస్యకు పరిష్కారం

సాక్షి ఎఫెక్ట్..

మల్కాజిగిరి: మల్కాజిగిరి చౌరస్తాలో డ్రైనేజీ సమస్యపై ఆదివారం 'మురుగు..పరుగు' వార్త ప్రచురితమైంది. డ్రైనేజీ శుభ్రం చేస్తే తరచూ.. సమస్య ఉత్పన్నమవుతుందని జలమండలి అధికారులు అభిప్రాయపడ్డారు. ఈ సమస్య పరిష్కారానికి స్థానిక కార్పొరేటర్ చొరవతో జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం ద్వారా సుమారు రూ. 7 లక్షలతో లీకేజీని అరికట్టడానికి నూతన పైపులైన్ పనులను ప్రారంభించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. బోనాల పండుగ సందర్భంగ త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించామన్నారు. వీఐ రమేష్, స్థానికులు విజయ్‌కుమార్, సునీల్‌యాదవ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



పైపులైన్ పనులను పరిశీలించిన కార్పొరేటర్ శ్రవణ్



కుషాయిగూడ జెడ్పీ స్కూల్ 1998-99 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కాప్రా: కుషాయిగూడ జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆదివారం 1998–99 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు చాలా రోజుల తర్వాత కలుసుకోవడంతో హర్షం వ్యక్తం చేశారు. దాదాపు 25 ఏళ్ల తర్వాత చిన్ననాటి జ్ఞాపకాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకుని, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వివిధ రంగాల్లో స్థిరపడి కుటుంబసభ్యులతో కలిసి ఆత్మీయ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించి గౌరవించారు. స్కూల్ ప్రధానోపాధ్యాయులు బాపిరెడ్డి, ఉపాధ్యాయులు రమేష్‌రెడ్డి, శివశర్మ, పూర్వ విద్యార్థులు దేవేందర్, రవీందర్, ఇస్మాయిల్, చిత్తారి, ఆనందర్, యాదగిరి, సుబ్రహ్మణ్యం, సూజాత, దుర్గాభవాని పాల్గొన్నారు.

మహిళపై అత్యాచార యత్నం !

అల్వాల్: మహిళపై ఇద్దరు వ్యక్తులు అత్యాచారయత్నానికి పాల్పడిన ఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బాలాజీనగర్‌కు చెందిన మహిళ (30) శనివారం మధ్యాహ్నం యాప్రాల్ నుంచి ప్యాసింజర్ ఆటోలో అల్వాల్‌కు వచ్చింది. కాగా గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు ఆటోలో ఎక్కి ఆమెను వైన్‌షాపు వద్దకు తీసుకెళ్లారు. అనంతరం కారులో రాత్రి సమయంలో మహిళను లోతుకుంటలోని ఖాళీ ప్రదేశానికి తీసుకువెళ్లి అత్యాచారానికి యత్నించగా.. ఆమె తప్పించుకుని బొల్లారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసును అల్వాల్ పోలీసులకు బదిలీ చేశారు. కాగా సదరు మహిళ మానసిక స్థితి బాగోలేదని ఫిర్యాదుపై దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

సొంత నిధులతో రోడ్డుకు మరమ్మతులు



లక్ష్మీనగర్ కాలనీలో చేపట్టిన రోడ్డు మరమ్మతు పనులు

బోడుప్పల్: బోడుప్పల్ లక్ష్మీనగర్ కాలనీలో గుంతలమయమైన రోడ్లకు సొంత నిధులతో ర్యాకల లక్ష్మీనారాయణ శనివారం మరమ్మతులు చేయించారు. జేమ్స్‌హౌస్ నుంచి అంజనాచారి హౌస్ వరకు రోడ్డుకు ప్యాచ్‌వర్క్స్ చేయించారు. రోడ్డు సమస్య పరిష్కారం కావడంతో ఆయన హర్షం వ్యక్తం చేశారు. స్థానిక కార్పొరేటర్ కాటపల్లి లతారాం చంద్రారెడ్డి, కాలనీ అధ్యక్షుడు అమర్ లింగారెడ్డి, కార్యదర్శి రాజుగౌడ్, మాజీ అధ్యక్షుడు చెన్నారెడ్డి ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

వారాహి అమ్మవారికి లక్ష పుష్పార్చన



ప్రత్యేక అలంకరణలో అమ్మవారి దర్శనం

కుషాయిగూడ : మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్, తిరుమలనగర్‌లోని పోచమ్మ, ముత్యాలమ్మ ఆలయంలో నెలకొల్పిన వారాహి అమ్మవారికి ఆదివారం లక్ష పుష్పార్చన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి రకరకాల పూలతో పూజలు చేశారు. గత తొమ్మిది రోజులుగా వారాహి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో విశేష పూజలు నిర్వహిస్తున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు బదరినాథ్‌శర్మ, ఆలయ కమిటీ అధ్యక్షుడు బ్రహ్మాచారి, ప్రధాన కార్యదర్శి సముద్రాల కృష్ణమూర్తి, రాజు, తిమ్మారెడ్డి, నర్సింహారావు, దుర్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు..

గౌతంనగర్: వారాహి నవరాత్రుల సందర్భంగా గౌతంనగర్ డివిజన్ ఉత్తమ్‌నగర్‌లోని శ్రీదుర్గా జ్యోతిష్యాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం మూలమంత్ర హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు నిర్వాహకులు నాగరాజుశర్మ ప్రకటించారు. కాలనీవాసులు, భక్తులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

కుషాయిగూడ : చర్లపల్లి డివిజన్, లక్ష్మీనర్సింహ్మాకాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. కాలనీ అధ్యక్షుడు సీహెచ్. నరసింహ, ప్రధాన కార్యదర్శిగా సుధాకర్, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్‌గౌడ్, ప్రవీణ్‌చారి, కనకయ్య, శ్రీధర్, కోశాధికారిగా శ్రీనివాస్‌చారి, దామోదర్, మల్లేష్, అడ్వైజర్లుగా గోపాల్‌రెడ్డి, రాజయ్య, ఎస్.కృష్ణ, పాండు, జాయింట్ సెక్రటరీలుగా సంతోష్, లింగస్వామి, తిరుమలరావు, పరమేశ్‌చారి, సభ్యులుగా రవి, ప్రవీణ్, లక్ష్మీనారాయణ, కిరణ్‌కుమార్‌యాదవ్, డాక్టర్ శ్రీను, అరుణ్‌కుమార్, శ్రీనివాస్, తిరుమలరావుతో పాటుగా పలువురు నియమితులయ్యారు.

రూ.2 లక్షల విలువైన మాదకద్రవ్యం పట్టివేత

అల్వాల్: మచ్చబొల్లారంలో రూ. 2 లక్షల విలువైన మాదకద్రవ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాల ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన అశోక్ (25) ధర్మారెడ్డి కాలనీలో నివసిస్తున్నాడు. అతడి వద్ద మాదకద్రవ్యాలు ఉన్నట్లు సమాచారం మేరకు ఆదివారం దాడులు నిర్వహించగా.. 2 కిలోల ఓపీఎం మారకద్రవ్యం లభ్యమైంది. నిందితుడిని అరెస్టు చేసి మాదకద్రవ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



ఉప్పల్ శిల్పారామంలో నాట్య ప్రదర్శనలో చిన్నారులు

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆదివారం చిలంక నాట్య కళాక్షేత్రం సంధ్యమోల్ శిష్య బృందంచే భరత నాట్యం అలరించింది. పుష్పాంజలి , అలరింపు, తోదయం, జతిస్వరం, శ్రీరామ పదం అంశాలపై సమీక్ష, అభిజ్ఞ, భవ్య, మిషిక, అద్వితీ, అధ్య, కనిష్క, బబితలు నాట్య ప్రదర్శన చేశారు.

దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తా: ఈటల



దీన్‌దయాల్‌నగర్ నాలాను పరిశీలిస్తున్న దృశ్యం

మౌలాలి : మౌలాలి డివిజన్‌ను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తానని ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. ఆదివారం మౌలాలి డివిజన్ మారుతినగర్ కాలనీలోని పార్టీ కార్యాలయంలో డివిజన్ ప్రజలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఈటల , కార్పొరేటర్ గున్నాల సునీతాయాదవ్, సీనియర్ నాయకులు వాసుదేవరావు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల మాట్లాడుతూ.. మల్కాజిగిరి ఎంపీగా తనను భారీ మెజార్టీతో గెలిపించిన మౌలాలి ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. మల్కాజిగిరి ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పార్లమెంట్‌లో లేవనెత్తుతానన్నారు.

24 ఏళ్లుగా ప్రజలతోనే..

గత 24 ఏళ్లుగా ప్రజలతోనే ఉన్నానని, ఎమ్మెల్యే, మంత్రి, ఇప్పుడు ఎంపీగా వారి సమస్యలన్నీ తెలుసునని వాటి పరిష్కారానికి నిరంతరం పోరాటం చేస్తానన్నారు.

◆ కులం, మతం ప్రాంతమని చూడకుండా ప్రతి ఒక్కరి సమస్య నా సమస్యగా భావించి పనిచేస్తానన్నారు. ప్రజల రుణం తీర్చుకునే అవకాశం ఎంపీగా కల్పించారని దానిని నిలబెట్టుకుంటానని పేర్కొన్నారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. మౌలాలి డివిజన్ ఆర్కేహెచ్ కాలనీ అష్టలక్ష్మి దేవాలయానికి మొదటిసారిగా వచ్చినప్పుడు టికెట్ తెచ్చుకోండి ఎంపీగా గెలుస్తారని చెప్పామని, ఇప్పుడు చెబుతున్నా.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్ కావడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. డివిజన్‌ను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తానని ప్రకటించినందుకు ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. – డివిజన్‌లోని పలు కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎంపీకి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఈస్ట్ దీన్‌దయాల్‌నగర్ కాలనీవాసులతో సమావేశమై నాలాను పరిశీలించారు. ముంపు సమస్య నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు. పార్లమెంట్ కన్వీనర్ ఆర్కే శ్రీనివాస్, బీజేవైఎం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు భానుప్రకాష్, సీనియర్ నాయకులు గున్నాల చంద్రశేఖర్‌యాదవ్, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్